క్లుప్తంగా

కోవిడ్ మార్గదర్శకాలు పాటించాలి

కాకినాడ క్రైం: కోవిడ్ ఉనికి విస్తృతమవుతున్న వేళ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఎయిర్‌పోర్టుల్లో కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, పిల్లలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. చేతులు ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రపరచుకోవాలన్నారు. మాస్క్ ధరించాలని, శానిటైజర్ తప్పనిసరిగా వినియోగించాలని పేర్కొన్నారు. కరచాలనాలు చేయవద్దన్నారు. గాలి, వెలుతురు ఉన్న ప్రదేశాల్లోనే గడపాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న వారి వివరాలను క్షేత్ర స్థాయి వైద్య, ఆరోగ్య సిబ్బందికి తెలపాలని అన్నారు. విదేశాల నుంచి వచ్చిన వారు తప్పనిసరిగా సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండాలని పేర్కొన్నారు. జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, నాలుక రుచి లేకపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ముక్కు కారడం, వాంతులు, విరేచనాల వంటి కోవిడ్ లక్షణాలుంటే తగిన వైద్యం పొందాలని, బయట తిరగడం మాని ఇంట్లో, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కోవిడ్ కేసులేవీ నమోదు కాలేదని పేర్కొన్నారు.

రెడ్ కాన్వెంట్ చేయూత



రెడ్‌కాన్వెంట్ ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తున్న దాతలు

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా విద్య, వైద్య సహాయంతో పాటు సామాజిక సేవ చేస్తున్నామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. దేవాలయం వీధిలో గల కార్యాలయంలో గురువారం ఎంబీఏ విద్యార్థికి ల్యాప్‌టాప్, డిగ్రీ విద్యార్థులు నలుగురికి ఉపకార వేతనాలు అందజేశారు. వీరితో పాటు మధుమేహం, గుండె వ్యాధితో బాధపడుతున్న ఇద్దరికి 3 నెలలకు సరిపడా మందులను పూర్వ విద్యార్థి తాళ్లూరి శ్రీనివాసరాజు చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి కళ్యాణి, ఎ.సరళ పాల్గొన్నారు.

క్రైమ్ టీమ్‌కు ఎస్పీ రివార్డులు



సీఐ అంకబాబుకు రివార్డు అందజేసిన ఎస్పీ బిందుమాధవ్

సామర్లకోట: పెద్దాపురం డివిజన్ క్రైం టీమ్‌కు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గురువారం రివార్డులు అందజేశారు. ఇటీవల రూ.10.24 లక్షల సొత్తు చోరీ జరగ్గా, 24 గంటల్లోనే కేసును పోలీసులు ఛేదించారు. దాంతో సామర్లకోట క్రైం స్టేషన్ సీఐ అంకబాబు, ఏఎస్సై బలరామ్, హెచ్‌సీలు రాధాకృష్ణ, శ్రీహరిలకు ఎస్పీ రివార్డులు అందజేశారు. ఈ మేరకు రివార్డులు అందుకున్న వారిని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు అభినందించారు. అన్నవరం బస్ కాంప్లెక్స్ వద్ద గుంటూరుకు చెందిన బోడపాటి నాగేశ్వరరావు అనే ప్రయాణికుడి బ్యాగ్ కోసి రూ.10 లక్షలు అపహరించిన విషయం విదితమే. ఇంటి స్థలం విక్రయించి తునిలో బస్సు ఎక్కి అన్నవరంలో దిగి గుంటూరు బస్సు కోసం నాగేశ్వరరావు వేచి ఉన్న సమయంలో బ్యాగ్‌ను విశాఖపట్నంకు చెందిన కంబాల శ్రీను అపహరించాడు. నిందితుడిని క్రైమ్ పోలీసులు పట్టుకుని, నగదు రికవరీ చేసినందుకు క్రైమ్ టీమ్‌కు రివార్డు దక్కింది.

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు	
ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ-1	8008293994
ఎంఈఓ-2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజ్‌శాఖ ఏఈఈ	9963744219
ఆర్‌అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీఏ	9490047668
నడకుదురు వెటర్నరీడాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558
అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్	9494671642
ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్	9704512131
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	9492600313
కరప ఎస్ఐ	9440796557

స్మార్ట్ సిటీ.. అభివృద్ధి అంతంతే..

- నిర్వహణ లోపంతో ఓపెన్ జిమ్‌లు
- కిర్రుకిర్రు శబ్దాలతో పరికరాలు
- అస్తవ్యస్తంగా పార్కులు, క్రీడా స్థలాలు

కాకినాడ లీగల్: దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న వంద స్మార్ట్‌సిటీల్లో 'పెన్షనర్స్ ప్యారడైజ్'గా పిలిచే కాకినాడ ఒకటి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో నగరం అభివృద్ధి జరిగిందా? లేదా? అంటే ప్రచారం జరిగిన స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు. స్మార్ట్‌సిటీల అభివృద్ధిలో భాగంగా కాకినాడ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.వెయ్యి కోట్లు వెచ్చించాల్సి ఉంది. అందులో ఇప్పటి వరకు రెండు ప్రభుత్వాల నుంచి రూ.400 కోట్లు పైనే విడుదలయ్యాయి. అయితే కేవలం రోడ్లు, లైటింగ్, డ్రైనేజీల పనులు చేపట్టి మిగిలినవి పైపై మెరుగులు దిద్దుతూ, అసలైన సమస్యలను అధికారులు పట్టించుకోవట్లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. «పార్కులు సైతం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం. మహిళలకు, పురుషులకు వేరువేరుగా వ్యాయామ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఖాళీ స్థలాలను క్రీడా ప్రాంగణాలుగా మార్చాం. కళాక్షేత్రం పేరుతో ఆడిటోరియం ఏర్పాటు చేశామంటూ చెప్పారే కానీ క్షేత్రస్థాయిలో ఇవి కనిపించడంలేదు.

ఓపెన్ జిమ్‌లు ఒకే.. నిర్వహణ ఏదీ?

స్మార్ట్‌సిటీలో భాగంగా కాకినాడలో పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా కోట్లాది రూపాయలతో పార్కులను అభివృద్ధి చేసి, వాటిలో లక్షలాది రూపాయలు వెచ్చించి మహిళలకు, పురుషులకు ఏర్పాటు చేశారు. వీటిలో పరికరాలు కనీస నిర్వహణ లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపట్టిపోయాయి. పరికరాలలో గ్రీజు, ఆయిల్ వంటివి పోవడంతో కిర్రు.. కర్రుమంటూ శబ్దాలతో జిమ్ చేసేవారు అసహనానికి గురవుతున్నారు. కుళాయి చెరువు పార్కు రాజాట్యాంక్, గాంధీనగర్ పార్కు,



పీఆర్ కళాశాల జిమ్‌లో వాకర్లు

జన్మభూమి పార్కు, బాలభవన్, పీఆర్ కళాశాల ప్రాంగణం, బోట్‌క్లబ్ పార్కులలో ఈ విధంగా నగరంలో పలు పార్కుల్లో, ఖాళీ స్థలాల్లో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. వాకర్స్ వాకింగ్ చేసిన తరువాత కాసేపు జిమ్ చేద్దామంటే పరికాలు మొరాయించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గతంతో పోలిస్తే..

మున్సిపాలిటీ స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయికి ఎదిగి అనంతరం స్మార్ట్‌సిటీగా ఎంపికైన కాకినాడ నగరం చాలా అభివృద్ధి చెందిందంటున్నారు. అయితే పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, కల్పించిన వాటికి నిర్వహణ లోపంతో నిరుపయోగమవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

వేసవి సెలవుల్లో ఆహ్లాదం కరవు

ఈ వేసవి సెలవులకు ఇక్కడివారు వివిధ ప్రాంతాలకు అక్కడ ఉండే ప్రజలు పిల్లలు, బంధువులు ఇంటికి వచ్చి కాసేపు సేద తీరుదామంటే కనీసం పార్కులు కూడా ఆహ్లాదకరంగా లేకపోవడంతో సందర్శకులు పెదవి విరుస్తున్నారు. పార్కుల నిర్వహణ లోపంతో చెత్త చెదారంతో పాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. పార్కులలో, రద్దీ ప్రాంతాల్లో, బస్‌స్టాండ్, బస్‌స్టాప్‌లలో ప్రధాన కూడళ్లలో ఇలా ఉచిత వైఫై సౌకర్యం కల్పించామని చెబుతున్నా అది పనిచేస్తున్న దాఖలాలు లేవు. అలాగే నగరంలో సీసీ కెమేరాల పర్యవేక్షణ సైతం లేదు.



గాంధీనగర్ పార్క్ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న మహిళలు, చిన్నారులు

అధికారులు పట్టించుకోవాలి



ప్రస్తుతం కార్పొరేషన్ పాలకవర్గం లేకపోవడంతో స్మార్ట్ సిటీ అధికారులు అభివృద్ధి, సౌకర్యాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజల ఆరోగ్యం కోసం అధికారులు లక్షలాది రూపాయలతో నగరంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. అయితే వాటికి కనీస పరిరక్షణ లేకపోవడంతో జిమ్ పరికరాలు తుప్పుపడుతున్నాయి. వ్యాయామం చేసే సమయంలో పరికరాలు పట్టేయడంతో కాళ్లు, చేతులు నొప్పులు వస్తున్నాయి. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించి పర్యవేక్షించాలి.

లంకే గోపి, స్థానికుడు

పర్యవేక్షణతోనే మన్నిక



లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన జిమ్ పరికారాలకు ప్రతినెలా గ్రీజు, ఆయిల్, ఇతర మరమ్మతులపై అధికారులు దృష్టి సారించి చేస్తే ప్రజలకు వ్యాయామం, ఆహ్లాదంతో పాటు లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన పరికరాలు నిరుపయోగం కాకుండా ఉంటాయి. అలాగే పార్కులలో పేరుకుపోయిన గడ్డి, చెత్తను తొలగించి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి. అధికారులు స్పందించి ఓపెన్ జిమ్ పరికరాలు పరిరక్షించే విధంగా ఏర్పాట్లు చేయాలి.

ఎస్‌వీ వెంకట రమణ,స్థానికుడు

రాజా రామ్మోహన్ రాయ్ సేవలు చిరస్మరణీయం



రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుబ్బారావు తదితరులు

కాకినాడ రూరల్: సామాజికంగా పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టి మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజా రామ్మోహన్ రాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1772 మే 22న జన్మించిన రాజా రామ్మోహన్‌రాయ్ సామాజిక, మతపరమైన దురాచారాల నిర్మూలనకు బ్రహ్మ సమాజాన్ని స్థాపించారన్నారు. సతీ సహగమనం, సాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి విశేష కృషి చేశారన్నారు. వితంతు వివాహాన్ని ప్రోత్సహించారని, స్త్రీ విద్యకు పాటుపడ్డారని తెలిపారు. మహిళలకు ఆస్తిలో హక్కులను ప్రోత్సహించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, కుమార్ యాదవ్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పిఠాపురం: గొల్లప్రోలు పాత బస్టాండ్ సమీపంలోని కనకదుర్గమ్మ గుడి సమీపంలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేసి, నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.24,200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

కరప: మండలం వేములవాడ శివారు పోలినాటివారి వీధిలో గురువారం రెవరెండ్ కె.శేఖర్‌మోజెస్ ఆధ్వర్యంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ సహవాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 500 మార్కులు పైబడి వచ్చిన నలుగురు విద్యార్థులను సత్కరించి, మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ద్వారా నగదు ప్రోత్సాహకం అందజేశారు. ముల్లపర్తి మహిమస్వరూప్ (547), పంపన చార్లెస్ జెన్నీఫర్ జ్యోతి (543), తోట రామచంద్రరావు (517) లకు ఒక్కొక్కరికి రూ.5 వేలు వంతున నగదు ప్రోత్సహకాన్ని డాక్టర్ జోసఫ్‌బెన్ని మండల పాస్టర్స్ ఫెలోషిప్ తరఫున అందజేశారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలుచేసి, విద్యార్థులకు దీవెనలు అందజేశారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ పి.సత్యప్రసాద్‌బాబు, కార్యదర్శి డాక్టర్ పి.సామ్యూల్‌రాజు, ట్రెజరర్ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.ఏసురత్నం, జాయింట్ సెక్రటరీ ఎస్.భరత్‌కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఐ.జాన్ సూర్యప్రకాష్, చైర్మన్ డాక్టర్ స్టీఫెన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరించి, నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ఫెలోషిప్ సభ్యులు

వ్యక్తిపై పోక్సో కేసు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రాయుడుపాలెంలో 12 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కంచెరు సూర్య ప్రభాకర్‌పై సర్పవరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గాజులు విక్రయించేందుకు రాయుడుపాలెం వెళ్లిన సూర్య ప్రభాకర్ కొనుగోలుకు వచ్చిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె తల్లికి విషయం చెప్పింది. ఈ మేరకు బాలిక తల్లి సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై లలితాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పెద్దిరాజు తెలియజేశారు.

ముగిసిన వేసవి హాకీ శిక్షణ



హాకీ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగమల్లితోట జంక్షన్: స్థానిక ఎస్ఎస్ఆర్‌కే తిలక్ స్ట్రీట్‌లోని మున్సిపల్ హై స్కూల్‌లో 30 రోజులుగా నిర్వహిస్తున్న హాకీ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి పాఠశాల విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్, 27 వార్డు టీడీపీ ఇంచార్జి కోడూరి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఆరేళ్లుగా పాఠశాలలో హాకీ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వీటి ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తున్నారన్నారు. సుమారు 40 మంది విద్యార్థులు పాఠశాల తరగతులు జరిగే సమయంలోను, పాఠశాల సెలవు రోజుల్లో సాధన చేస్తున్నారని వివరించారు. ఇన్‌చార్జి కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని నిర్వహించేందుకు గౌరీ శంకర్ ప్రోత్సాహం, పాఠశాల ఇంగ్లిష్ అసిస్టెంట్ కృష్ణవేణి ఆర్థిక సహాయంతో విద్యార్థులకు క్రీడా పరికరాలు సమకూర్చినట్టు తెలిపారు. అలాగే పాఠశాల హెచ్‌ఎం పుష్పగిరి సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ శిబిరంలో హాకీ కోచ్ సూరిబాబు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. కోకోనాడ కోస్టల్ క్లబ్ అధ్యక్షులు రవిచంద్ర, రాష్ట్రస్థాయి క్రీడాకారులు ఫైబర్ స్టిక్స్ ఇచ్చి ప్రోత్సహించారు. అలాగే ఈ శిబిరం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీల ఎంపికకు జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు రవి రాజు ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎ.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు

జీవన ప్రమాణాలు పెంచేందుకు చర్యలు

- టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి

కొత్తపల్లి: స్థానిక మత్స్యకారులు, చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను మరింత పెంచేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర టూరిజం చీఫ్ మార్కెటింగ్ అధికారి పద్మారాణి అన్నారు. మండలంలోని ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల్లో గురువారం స్థానిక అధికారులతో కలసి ఆమె పర్యటించారు. ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత మగ్గాలను పరిశీలించి జాంధానీ చీరల తయారీ, అమ్మకాలు, కార్మికుల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తీర ప్రాంతంలో పర్యటించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్‌ను పరిశీలించారు. రామన్నపాలెం ఉప్పుటేరులో బోటుపై పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఉప్పాడ తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ విశాలమైన తీర ప్రాంతంలో అనేక మంది మత్స్యకారులు బోట్లపై జీవనోపాధి పొందడం గుర్తించామన్నారు. ప్రధానంగా ఉప్పాడలో తయారు చేసే చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి పెంచేందుకు, కార్మికుల జీవనోపాధి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై వివరాలను సేకరించి తద్వారా నివేదికను పంచాయతీరాజ్ శాఖకు సమర్పిస్తామని అన్నారు. టూరిజం కన్సల్టెంట్ నిష్ఠాగోయల్, క్రియేటివ్ డిజైనర్ మణికంఠ, ఎంపీడీఓ పి.రవికుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



బోటుపై అధికారులతో పర్యటిస్తున్న రాష్ట్ర పర్యాటక చీఫ్ మార్కెటింగ్ అధికారి పద్మారాణి

వైభవంగా హనుమజ్జయంతి

- స్వామివారికి పంచామృతాభిషేకాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కాకినాడ రూరల్ రేపూరులో పుష్పాలంకరణలో పంచముఖ ఆంజనేయ స్వామి వారు

బోట్‌క్లబ్: హనుమజ్జయంతిని గురువారం నగరంలో పలు ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో స్వామివార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆయా ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయ ఆలయంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. ఈఓ ఉండవల్లి వీర్రాజు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి వడమాల సమర్పించారు. స్థానిక రిజర్వుపోలీస్ లైన్ అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి వివిధ నదీ నలాలతో అభిషేకం చేశారు. గంధ సిందూర పూజ, తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి తమలపాకుల పూజ, వడమాల కైంకర్యం నిర్వహించారు. ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. రామారావుపేట శివాలయంలోని ఆంజనేయస్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని ఆభయాంజనేయునికి విశేష పూజలు చేశారు. స్థానిక ఎల్‌బీ నగర్‌లోని ఆంజనేయస్వామికి తమలపాకులపై శ్రీరామ నామాలు రాసి పూజ చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో సత్యశావాహినిలో ఉన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించి వడలు ప్రసాదంగా పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్థానిక కొండయ్యపాలెం ఆంజనేయస్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు.

కాకినాడ రూరల్: హనుమజ్జయంతిని నియోజకవర్గంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామ గ్రామాన ఆంజనేయ ఆలయాలు, విగ్రహాల వద్ద ఉత్సవ కమిటీలు, భక్తుల ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మండలంలోని రేపూరు గ్రామంలో పంచముఖ అభయాంజనేయ ఆలయంలో మూడు రోజులుగా జయంత్యుత్సవాలు నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున పంచామృతాలు, వివిధ జలాలతో అభిషేకాలు చేశారు. గ్రామంలో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. రథంపై స్వామి వారిని ఊరేగించగా మహిళలు కోలాటం ఆడారు. హనుమంతుని వేషధారణతో గ్రామస్థుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో స్వామివారి ఆలయం వద్ద భక్తులు కిక్కిరిసారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏఎస్సై నాగేశ్వరరావు దంపతులు భక్తులు ప్రసాద వితరణ చేశారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ వద్ద ఐదు గుళ్ల ప్రాంగణంలో స్వామి వారికి అర్చకుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంతో తమలపాకులు, సిందూరంతో పూజలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో హనుజ్జయంతిని ఘనంగా నిర్వహించగా మహిళలు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

కరపలో..

కరప: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతిని ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కరప, పేపకాయలపాలెం, వలసపాకల, వేములవాడ, వేళంగి, వాకాడ, యండమూరు, ఉప్పలంక, అరట్లకట్ట, నడకుదురు, కూరాడ, పెదకొత్తూరు తదితర గ్రామాల్లోని అభయాంజనేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, తమలపాకుల అర్చన నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భజనబృందాలు శ్రీరామసంకీర్తనలతో ఏకాహం నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆయా గ్రామాల్లో స్వామివారికి సింధూర, నాగవల్లి, తులసి పత్రాలతో సహస్రనామార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం తదితర పూజాదికాలు చేసి, నడకుదురులోని ఆంజనేయ ఆలయంలో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కరప జ్యోతిషాలయంలో సువర్చలా సహిత పంచముఖేశ్వరస్వామికి గాదావరఘుల కొండయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో హనుజ్జయంతి నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి మహన్యాసం, ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం, సహస్రనామాలతో సువర్చలదేవత అష్టోత్తరం నిర్వహించారు. కరప విష్ణాలయం లోని అభయాంజనేయునికి అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ విశేష పూజలు చేశారు. పెనుగుదురు, వలసపాకల, వేళంగి గ్రామాల్లోని స్వామివారి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.



వలసపాకలలోని అభయాంజనేయస్వామి



బాలాత్రిపుర సుందరి ఆలయంలో వడమాల, తమలపాకుల అలంకరణలో స్వామివారు



ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని ఆలయంలో స్వామివారు



ఏపీఐఐసీ కాలనీలో ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



రేపూరులో నిర్వహించిన ఊరేగింపులో ఆంజనేయ వేషధారణతో భక్తుడు



రేపూరులో సాగుతున్న ఆంజనేయుని రథోత్సవం